క్లుప్తంగా

హనుమాన్ సందర్శన యాత్ర



యాత్రలో పాల్గొన్న అవోపా భక్తులు

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) వారి ఉచిత సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం 135 మంది భక్తులతో మురడి, నేమకల్లు, కసాపురం యాత్ర చేయించినట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిరియాల శ్రీధర్ తెలిపారు. ఒకేరోజు మూడుచోట్ల ఆంజనేయ స్వామి దర్శనం, అధిక శ్రావణమాసంలో చేస్తే మూడు జన్మల పాపపరిహారం అవుతుందని తెలిపారు. ముఖ్య సౌజన్యకర్త రాచోటి సుధాకర్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రలో ప్రతాప్, ఈరన్నశెట్టి, రఘు, రామంజి, అశ్వర్థం మధు, శ్రీనాథ్ గుప్తా, శ్రీధర్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్



పట్టుబడిన మద్యం, బైక్‌లను చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు

ఆదోనిఅర్బన్: సమస్యాత్మక ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తనిఖీల్లో పది బాక్సుల కర్ణాటక మద్యం (960 టెట్రా ప్యాకెట్లు), సరైన ధ్రువ పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు శ్రీనివాసనాయక్, నిరంజన్‌రెడ్డి, పార్థసారథి, మంజునాథ్, ఎస్‌ఐలు జయశేఖర చంద్ర, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వినతులు పరిష్కరించాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: జగనన్న సురక్ష కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న వినతులకు పరిష్కారం చూపాలని, ఇందుకు సంబంధించిన ప్రణాళికను తయారు చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. ఆయన మంగళవారం ఈఓపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వినతులను వలంటీర్లు పూర్తి చేశారా లేదా అనే విషయాలు తెలుసుకుని వెంటనే పూర్తి చేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. సక్రమంగా పనిచేయని వాలంటీర్లపై నివేదిక ఇవ్వాలన్నారు. కార్యదర్శులు అబ్దుల్‌కరీం, మంజునాథ్, యోగేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, అబ్దుల్ వహీద్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐఎంఏ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం చేపట్టారు. ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయన్నారు. తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డ మెదడు వికసించడంతో పాటు శిశువు సమతుల్యమైన ఆహారం అందుతుందన్నారు. బిడ్డ రక్తహీనత బారినపడకుండా కాపాడతాయన్నారు. ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు, డాక్టర్లు కృష్ణమూర్తి, హరీష్, ఉషారావు, ఈసీ మెంబర్లు డాక్టర్ ఉషశ్రీ, సూరదాస్, రఘునాథ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి

ఆదోనిరూరల్: ట్రాన్స్‌పోర్టు హమాలీలకు ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ యజమానులు కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శి తిప్పన్న, పీఎస్ గోపాల్, నాయకులు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వారు మాట్లాడుతూ.. ట్రాన్స్‌పోర్టు కార్మికుల రెండేళ్ల కూలీ రేట్ల ఒప్పందం ముగిసిందని, ఇకపై రేట్లు పెంచాలని ఫర్టిలైజర్ పెస్టిసైడ్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోకానందరెడ్డికి డిమాండ్ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రేట్లపై 50 శాతం పెంచాలని, హమాలీలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది షాషావలి, కృష్ణ, వెంకటేశులు, ముని తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- ఆదోనిలో నేడు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

ఆదోని సెంట్రల్: పేద మధ్య తరగతి మహిళల్లో సరైన పోషకాహారం లేక రక్త హీనతతో బాధపడకూడదని ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోంది. పుట్టబోయే బిడ్డ కూడా పరిపూర్ణమైన ఆరోగ్యంతో పుట్టాలి. పుట్టిన పిల్లల ఎదుగుదల సరైన క్రమంలో ఉండడం, ఆరోగ్య సమస్యలకు గురికాకుండా పౌష్టికాహారం అందిస్తారు. గర్భవతులు, బాలింతలు, చంటి పిల్లలకు టీకాలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆదోని పట్టణంలో 126, గ్రామీణ ప్రాంతాల్లో 98 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. అయా కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలు 5,919 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో 1,505 మంది గర్భవతులు, 1,261 మంది బాలింతలు ఉన్నారు. పట్టణంలో 1,691 మంది గర్భవతులు, 1,462 మంది బాలింతలు ఉన్నారు. పేద, మధ్యతరగతి మహిళలు రక్తహీనత అనారోగ్య సమస్యలతో బాధపడకూడదని ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు 15,924 కేజీల బియ్యం, 5,308 కేజీల బ్యాళ్లు, 2,654 లీటర్ల మంచినూనె వచ్చాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులను అయా అంగనవాడీ కేంద్రాలకు చేర్చారు. గర్భవతులు, బాలింతలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందిస్తున్న బలవర్ధకమైన ఆహారం సంపూర్ణ పోషణ కిట్లను అందించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇంటికే సంపూర్ణ పోషణ కిట్లు

ఇప్పటివరకు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బలవర్ధకమైన ఆహారం అందించేవారు. కొంతమంది కేంద్రానికి వచ్చి భోజనం చేయగా మరికొంతమంది కేంద్రానికి వచ్చి భోజనం చేసేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రభుత్వం కూడా ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఒక లబ్ధిదారుకు 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, 1/2 లీటరు మంచినూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలను అందిస్తారు. వీటితో పాటు 2 కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 1/2 కేజీ బెల్లం, 1/4 కేజీ చిక్కి, 1/2 కేజీ ఖర్జూరం పంపిణీ చేస్తారు. ఇప్పటికే కేంద్రాలకు బియ్యం, బ్యాళ్లు, మంచినూనె, పాలు వంటివి చేరవేశారు. ఈ నెల 2వ తేదీన ఎమ్మెల్యే చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేయనున్నారు.



పౌష్టికాహార కిట్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

బలవర్ధక ఆహారం



ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటికే ఇవ్వడం సంతోషంగా ఉంది. గతంలో కేంద్రంలోనే భోజనం చేసేవాళ్లం. కొంత మంది భోజనం చేయడానికి రాలేక ఇబ్బందులు పడేవారు. దీంతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం పౌష్టికాహార కిట్లను ఇళ్ల వద్దకే ఇవ్వాలని నిర్ణయించింది. మాలాంటి గర్భిణి, బాలింతలకు బలవర్ధక ఆహారం అందించాలని ప్రభుత్వం పోషక విలువలతో కూడిన సరుకులను అందజేస్తుంది. తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగు పరుచుకోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.
– నాగమ్మ, ఇందిరానగర్, ఆదోని

తల్లి బిడ్డ సురక్షితంగా ఉండాలి



పేద మధ్య తరగతి మహిళలు రక్త హీనతతో బాధపడకూడదని ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డలకు జన్మనివ్వాలని ప్రభుత్వం బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలతో పాటు రాగి పిండి, చిక్కి, డ్రైఫ్రూట్స్ వంటివి అందిస్తుంది. గతంలో గర్భిణులు, బాలింతలకు అంగనవాడీ కేంద్రాల్లోనే భోజనాలను ఏర్పాటు చేసేవాళ్లం. కొంతమంది భోజనానికి వచ్చేందుకు ఇబ్బంది పడేవారు. ప్రభుత్వం వారిని దృష్టిలో ఉంచుకొని ఇంటివద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించనుంది.
– పుష్పావతి, సూపర్‌వైజర్

పంపిణీకి సిద్ధం చేస్తున్నాం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటి వద్దకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 2వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటిని పంపిణీ చేసే విధంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులను సిద్ధం చేస్తున్నాం. ఎవరూ ఇబ్బందులకు గురి కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ బలవర్ధకమైన ఆహారం అందించే విధంగా చర్యలు చేపడుతున్నాం.
– రాగిణి వసంత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

పాండురంగస్వామికి పౌర్ణమి పూజలు



ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లగొండ పాండురంగ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము నుంచి స్వామివార్లకు పంచామృతాభిషేకం, తులసీహారం, పూలతో ప్రత్యేకంగా అలంకారం చేసి మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

అవాంతరాలు లేకుండా నీటి సరఫరా

ఆదోనిటౌన్: అవాంతరాలు లేకుండా తాగునీటిని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి వాటర్ వర్క్స్ విభాగం అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ పీస్ పార్కులోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద నీటి సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 42 వార్డుల పరిధిలో నీటి కొరత ఉందని, ఎక్కడా ఎలాంటి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. తుంగభద్ర జలాశయంలో రోజురోజుకు నీటి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని, త్వరలోనే రా వాటర్‌ను దిగువ కాలువకు వదులనున్నట్లు కమిషనర్ చెప్పారు. కెనాల్‌లో ప్రవహిస్తున్న రా వాటర్‌ను బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల చెరువుకు పంపిణీ చేసి నింపడం జరుగుతుందన్నారు. నీటి పంపింగ్‌లో లీకేజీలు లేకుండా చూడాలన్నారు.

కారుణ్య నియామకాలపై హర్షం



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డినికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

ఆదోనిరూరల్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతిచెందిన ఐదుగురు కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య కోటా కింద ఉద్యోగాలు కల్పించేందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కృషి చేశారు. ఈ మేరకు ఉద్యోగాలు పొందిన వారు మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి దుశ్శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎం.బాలరాజు కుటుంబంలో చంద్రకళ, టి.రాము కుటుంబంలో రాణి, ఐ.సి.రుక్మన్‌కుమార్ కుటుంబంలో రాములమ్మకు, అయ్యప్ప కుటుంబంలో ఎం.లక్ష్మికి, కోసిగి ఈరన్న కుటుంబంలో కోసిగి నాగరాజ్ కారుణ్య నియామాల కింద పారిశుద్ధ్య కార్మికులుగా ఉద్యోగాలు పొందినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. వార్డులను శుభ్రపరుస్తూ నిత్యం శ్రమించే కార్మికులు విధి నిర్వహణలో మృతిచెందడం బాధాకరమన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు బి.శివరాములు, శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులలో అలసత్వం ప్రదర్శించవద్దని మండల విద్యాధికారులు బి.శివరాములు, శ్రీనివాసులు సూచించారు. మంగళవారం పట్టణంలోని పురపాలక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండవ విడత నాడు–నేడు పనుల్లో భాగంగా తాగునీరు, మూత్రశాలలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజన అందించాలన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలు స్టూడెంట్ ఇన్‌ఫర్మేషన్ పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ కేంద్రాలు ప్రారంభించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కౌతాళం: చెత్త నిర్వహణ కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభం కావడంతో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. లేబర్ రిపోర్టింగ్, ఆధార్ సీడింగ్, ఆధార్ అథెంటికేషన్, హార్టికల్చర్ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులు సంతృప్తిగా ఉన్నా చెత్త నుంచి సంపద తయారీ పనుల్లో వెనుకబడి ఉన్నారన్నారు. మండలంలో 21 కేంద్రాలకు గాను ఇంకా 12 కేంద్రాలను ప్రారంభించకపోవడమేమిటని ప్రశ్నించారు. వీటిని త్వరలోనే ప్రారంభించాలన్నారు. కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సహకారంతో ఈ నెలాఖరులోగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న హౌసింగ్ కాలనీలకు సంబంధించి పాత బకాయిలు రూ.12.49 లక్షలు త్వరలోనే విడుదల చేస్తారని తెలిపారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ లోకేష్, ఈఓపీఆర్‌డీ జనార్దన్, ఏపీఓ జుబేర్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ సర్వేపై బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో ఓటర్ల సవరణ సర్వే, పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బీఎల్‌ఓ రోజుకు 10 నుంచి 12 ఇళ్లలో ఓటర్లను విజిట్ చేయాలన్నారు. అలాగే కొత్త ఓటరు దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు. బీఎల్‌ఓల సర్వేపై ఎన్నికల సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ బూత్‌లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, ర్యాంపులు, రోపులు వంటి మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని 45, 46, 35, 34, 3 పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను వీడియోల ద్వారా తనిఖీ చేశారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎన్నికల డీటీ గురురాజరావు, డీటీ రఘువీర, ఎన్నికల సూపర్‌వైజర్లు ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఏఎస్‌ఓ సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పక్కా ఓటరు జాబితా రూపొందించాలి

ఎమ్మిగనూరురూరల్: తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 21 వరకు బీఎల్వో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను చూయించి అభ్యంతరాలు ఉంటే సేకరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్వోలకు సహకరించి తప్పులున్నా, కొత్త ఓటర్లు నమోదులో సాయం చేయాలని, అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఇంటింటి ఓటరు సర్వేలో నిర్లక్ష్యం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కొరతపై తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్ శర్మ, నిత్యానంద్, ఎన్నికల డీటీ గురురాజావు, వీఆర్వో షేక్షావలి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ఆదోనిటౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను డాక్టర్లు అనిల్‌సాగర్, షేకున్‌భాను చేతులమీదుగా పంపిణీ చేశారు. ప్రధానమంత్రి ముక్త్ భారత్‌లో భాగంగా పౌష్టికాహారం కిట్లను అందజేశారు. క్షయవ్యాధిగ్రస్తులు ఐదుగురిని దత్తత తీసుకొని నెలకు రూ.వెయ్యి విలువ చేసే పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేయనున్నామని డాక్టర్ అనిల్ సాగర్ తెలిపారు. వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు ఆరు నెలల పాటు పౌష్టికాహారం కిట్లను అందించున్నట్లు చెప్పారు. వ్యాధిగ్రస్తులు నెలా నెలా ఉచితంగా పరీక్షలు చేయించుకొని మందులు పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, అర్బన్‌హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

'టీడీపీ నాయకులు తెలుసుకుని మాట్లాడాలి'

పెద్దకడబూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి ఏ అర్హతపై మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారని టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని పెద్దకడబూరు సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్ష పదవి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నామినేటెడ్ పదవి అని చెప్పారు. అందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆయనకు ఆహ్వానం అందింది కాబట్టే మండల మీట్‌కు హాజరయ్యారన్నారు. ఇది తెలుసుకోకుండా ఆయన సర్వసభ్య సమావేశానికి హాజరు కాకూడదనడం టీడీపీ నాయకుల మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్లు ఏ హోదాలో సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనే వారిని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు.

కల్లుదేవకుంట సంఘం చైర్మన్‌గా రఘునాథ్‌రెడ్డి



మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం కల్లుదేవకుంట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా విశ్రాంత వీఆర్‌ఓ, అదే గ్రామానికి చెందిన కె.రఘునాథ్‌రెడ్డిని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కల్లుదేవకుంట సహకార సంఘం చైర్మన్‌గా ఎంపిక కావడంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. గతంలో చిలకలడోణ గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి పదవీ కాలం ముగియడంతో కొత్త చైర్మన్‌గా ఎంపిక చేశారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న అధికారులు

మంత్రాలయం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందజేసిన ఉన్నతి రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ పొదుపు సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మహిళ రుణాలను పొంది వృద్ధి చెందాలన్నారు. తీసుకున్న రుణాలకు వాయిదాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందాలన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడి ఎన్నిక



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని గజమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న సంఘం అధ్యక్షుడు నరసింహులు, మండల నాయకులు

కోసిగి: మండలంలోని ఆర్లబండ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కోసిగి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆర్లబండ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సీఈఓ రవికుమార్ సమక్షంలో నాడుగేని నరసింహులు సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గజమాల, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవికి ఎంపిక చేయడంపై ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని నరసింహులు అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గౌరవప్రదమైన పదవులు వరిస్తాయన్నారు. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, అంకితభావంతో రైతులకు సేవలందించి మన్ననలు పొందాలన్నారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ, చెన్న బసవరాజు, మంగమ్మ, మాణిక్యరాజు, షౌకత్‌అలీ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: మండలంలోని అన్ని గ్రామాలలో మౌలిక వసతులు కల్పించాలంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కల్లుకుంట, బసలదొడ్డి, చిన్నతుంబళంతో పాటు ఆయా గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు రోడ్లపై పారుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే కొన్ని గ్రామాలలో తాగునీటిసమస్య, వీధి లైట్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు చీకట్లలోనే మగ్గుతున్నారన్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావుకు సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సహాయ కార్యదర్శి చంద్ర, నాయకులు ఆంజనేయులు, గోపాల్, తిక్కన్న, సర్దార్ పటేల్ తదితరులు ఉన్నారు.

'బీఈడీ కళాశాలల తీరు అధ్వానం'

ఆదోని సెంట్రల్: ఆదోని, ఎమ్మిగనూర్ పట్టణాలలో బీఈడీ కళాశాలలు దూర విద్యతరహాలో నడుపుతున్నారని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అఫ్రీద్, ఉపాధ్యాక్షుడు నవీన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కళాశాలల్లో తరగతులు నిర్వహించకుండా, బ్లాక్‌టీచింగ్ చేపట్టకుండానే కళాశాలలను నడుపుతున్నారని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కన్నా అధికంగా వసులు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు, రామలింగ, వినోద్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

హాలహర్వి: కళ్ల కలక పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మన్సూర్‌వలీ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో ఆయన సమావేశమయ్యారు. కళ్ల కలక వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కళ్ల కలక వైరస్‌తో వస్తుందని, గాలి, నీటి వల్ల, టవల్స్, జేబురుమాళ్లు, దుస్తుల వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. కళ్లు ఎర్రబడడం, వాపు, నొప్పి, దురద, చీము కారడం, రెప్పలు అతుక్కుపోవడం, వెలుతురు చూడలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నొప్పి తగ్గడానికి ఐబ్రోఫెన్ ప్లస్ పారసిటమాల్ మాత్ర తీసుకోవాలని సూచించారు. తర చూ చేతులు శుభ్రం చేసుకోవాలని, కళ్లను ఎక్కువ గా తాకడం,నలపడం చేయరాదన్నారు. అలాగే నులి పురుగుల నివారణ, మిషన ఇంద్రధనస్సు ఫీవర్ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ అబ్రహం, సుగుణ సీహెచ్‌ఓ ఆదినా రాయణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కనబడిన వారిపై దాడి చేసి కరిచి గాయపరిచింది. ఈ దాడిలో సుమారు 20 మందికి పైగా గాయపడ్డారు. బాధితులు చికిత్స కోసం అర్ధగేరి, ఆలూరు, బళ్లారిలోని ఆస్పత్రులకు పరుగులు తీశారు. గ్రామంలో కుక్కల సంతతి పెరిగిందని, అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

తుగ్గలి: మండల పరిధిలోని నునుసరాల్లకు చెందిన ఐదుగురిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొలం పనులకు పిలిస్తే రావడం లేదనే కారణంతో నునుసరాల్లకు చెందిన హరిజన రంగమ్మ, రంగన్న, కుమారుడు రాకేష్‌పై అదే గ్రామానికి చెందిన దేవదాసు, రామదాసు, మహేష్, పెద్ద ఎల్లగౌడ్, చిన్న ఎల్లగౌడ్ రెండు రోజుల క్రితం కులం పేరుతో దూషించి దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు గడ్డివాముల దగ్ధం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఖాళీ స్థలంలో వేసుకున్న రెండు గడ్డివాములు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన తోట సిద్ధప్ప ఐదెకరాల గడ్డి, వందవాగిలి బోయ తాయన్నకు చెందిన రెండెకరాల గడ్డి మంటల్లో కాలిపోయాయి. స్థానికులు ఆలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వగ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.